క్లుప్తంగా

15 వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు

కొమరోలు: మండలంలో 15 వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ బ్లెస్సింగ్స్టన్ తెలిపారు. శుక్రవారం కొమరోలులో వయోజన విద్యా కేంద్రాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ షేక్ అబ్దుల్‌ఫరూఖ్ ప్రారంభించారు. అనంతరం వయోజన విద్యను అభ్యసిస్తున్న వారికి పుస్తకాలు, పలకలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న మండల సర్వసభ్య సమావేశం

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు మండల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయులకు అవగాహన


మాట్లాడుతున్న ఎంఈఓ

అర్ధవీడు: మండలంలోని నాగులవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. జీఓ నంబర్ 117పై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి అప్‌గ్రేడ్ చేయడం, ఇతర పాఠశాల్లో విలీనం చేయడం లాంటి అంశాలపై చర్చించారు. ఎంఈఓ-2 లక్ష్మీనాయక్, ప్రధానోపాధ్యాయులు రాజారావు, సునీత, సలోమి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

25 సోలార్ లైట్లు అందజేత


చెన్నారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు

తర్లుపాడు: మండలంలోని రెండు పంచాయతీలకు రెన్యూ సోలార్ సంస్థ 7.50 లక్షల రూపాయల విలువైన 25 సోలార్ లైట్లను బహూకరించింది. చెన్నారెడ్డిపల్లికి 23 సోలార్ లైట్లు, తర్లుపాడు గ్రామానికి 2 సోలార్ లైట్లను కంపెనీ ప్రతినిధులు శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ కుందురు సత్యనారాయణరెడ్డి, పంచాయతీ సెక్రటరీ సుభాకర్, రెన్యూ సోలార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల బియ్యం.. పక్కదారి!


రైస్‌మిల్లులో పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు(ఫైల్)

బేస్తవారిపేట:

అధికార పార్టీ నేతల ధన దాహం తీరడం లేదు. సహజ వనరులైన ఇసుక, గ్రావెల్ దందాతో దండిగా సందపాదిస్తున్న కూటమి నాయకులు పేదల కడుపులు కొట్టి మరీ జేబులు నింపుకొంటున్నారు. అక్రమార్కులు నిత్యం రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలిస్తున్నప్పటికీ స్థానిక అధికారులు నెలవారీ వాటాలు పుచ్చుకుంటూ నిద్ర నటిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం అక్రమ రవాణాపై అధికారులకు సమాచారం ఇచ్చినా భారీగా మాముళ్లు అందుతుండటంతో కనీస స్పందన ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

జోరుగా అక్రమ దందా

ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డు పక్కన చెట్టిచర్ల సమీపంలోని రైస్‌మిల్లులో గత ఏడాది ఆగస్టు నెలలో అక్రమంగా 253 బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారు. సమాచారం అందుకున్న ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ క్రిష్ణమోహన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. రైస్‌మిల్లు యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. నేడు ఇదే రైస్ మిల్లులో రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతుంది. గత ఏడాది అక్టోబర్ నెల 24వ తేదీన సబ్‌కలెక్టర్ అర్ధరాత్రి కంభంలో 600 బస్తాల రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న లారీని పట్టుకున్నారు. తాజాగా అదే రైస్ మిల్లు నుంచి 300 క్వింటాళ్ల పాలిష్‌డ్ రేషన్ బియ్యం లారీని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ సీజ్ చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఏరకంగా సాగుతుందో ఈ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి

బేస్తవారిపేటలోని ఓ రైస్‌మిల్లుకు..

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కార్డుదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని రాత్రి వేళ బేస్తవారిపేటలోని హైవేరోడ్డు పక్కన ఉన్న ఓ రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. మిల్లులో రీసైక్లింగ్ చేసి వేరే బ్యాగుల్లోకి మార్చి నెల్లూరు, కాకినాడ, తమిళనాడు పోర్టులకు తరలిస్తున్నారు. బేస్తవారిపేట నుంచి ప్రతి రోజూ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పదుల సంఖ్యలో లారీల్లో అక్రమంగా రేషన్ బియ్యం తరలివెళ్తున్నా పట్టించుకోవడంలేదు.

ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు

ప్రతి నెలా రేషన్ డీలర్ల వద్ద, కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయడంతోపాటు వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు ప్రత్యేకంగా ఓ బృందం అధికార పార్టీ ముఖ్యనేత కనుసన్నల్లో పని చేస్తున్న విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏకంగా సివిల్ సప్లయిస్ గోడౌన్ నుంచే నేరుగా బ్లాక్ మార్కెట్‌కు బియ్యం తరలించే స్థాయికి అక్రమార్కులు ఎదిగిపోయారనే చర్చ జోరుగా నడుస్తోంది. కార్డుదారుల నుంచి కేజీ బియ్యాన్ని రూ.12 చొప్పున కొంటున్న మాఫియా అదే బియ్యాన్ని రూ.35 నుంచి రూ.40కు విక్రయిస్తున్నట్లు సమాచారం.

కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ప్రత్యేక బృందాలు చెప్పిన ధరకు అమ్మాలి, అలా కాదని ఇతరుకు విక్రయిస్తే వెంటనే అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారు. తద్వారా బయట ప్రాంతాలకు బియ్యం తరలిపోకుండా, తాము సూచించిన వారికే చేరేలా టీడీపీ నేతల బృందం పూర్తి స్థాయిలో కట్టడి చేస్తోంది. వీరికి గతంలో కిలో బియ్యానికి ఎంతో కొంత ఇచ్చేవారు. వారికి మండలాల్లో కొన్ని పంచాయతీలను కేటాయించి బియ్యం సేకరించేవారు. తక్కువ బియ్యం వచ్చినప్పుడు ఆదాయం సరిపోకపోవడంతో వారిలో వారికే మనస్పర్ధలు వస్తున్నాయి. వ్యతిరేకత పెరుగుతుండటంతో నేడు నెలకు స్థాయిని బట్టి రూ.25 వేల నుంచి రూ.50 వేలు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా కొన్ని చోట్ల డీలర్లు కొనుగోలు చేసి అమ్ముతుండటం గమనార్హం.

ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

గిద్దలూరు రూరల్: ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కడప లక్ష్మి అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో పని చేయాలని కోరారు. ప్రధానంగా ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో ప్రస్తుతం 7 హైస్కూల్స్ ఉన్నాయని కొత్తగా మరో 3 హైస్కూళ్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బి.నోవెల్, బత్తెం రాజమ్మ, ఎంపీడీఓ డి.వి.రమణారెడ్డి, ఏఓ విజయభాస్కర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, పంచాయతీరాజ్ ఏఈ సుబ్బారావు, ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి, ఏపీఓ రమణి, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభి రామస్వామి ప్రతిష్ట మహోత్సవం

– మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు హాజరు


పూజల్లో పాల్గొన్న అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని రామాంజనేయ నగర్‌లో పట్టాభి రామస్వామి దేవస్థానంలో శుక్రవారం గణపతి సహిత సీతా లక్ష్మణ రామచంద్రుడి విగ్రహాల ప్రతిష్ఠ, నూతన ధ్వజ స్తంభం, మహా కుంభాభిషేక ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల్లో మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం అన్నా రాంబాబును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, బార్ అసోషియేషన్ అధ్యక్షులు భూపని కాశయ్య, శివరాంపురం సర్పంచ్ బ్రహ్మం పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాముడికి వెండి గొడుగు, మకర తోరణం


మకర తోరణం గ్రామోత్సవం

పొదిలి: స్థానిక విశ్వనాథపురం కాలేజీ రోడ్డులో సీతారామచంద్ర స్వామి ఆలయానికి దాతలు మకరణ తోరణం, వెండి గొడుగు తయారు చేయించారు. ఆలయ ధర్మకర్త పోలిరెడ్డి ఆధ్వర్యంలో మకర తోరణం, వెండి గొడుగును దాతల గృహాల నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. మేళ తాళాలు, వేద మంత్రాల నడుమ స్వామి వారికి అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సామి రాజా, సుబ్రమణ్యం(శివ), కోటేశ్వరరావు, సూరి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కృషితో విజయం తథ్యం


అన్నా రాంబాబు, కృష్ణచైతన్యను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

– మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: విద్యార్థులు నిరంతర కృషి, పట్టుదలతో విజయాలు సాధించవచ్చని మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీకి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొత్త విషయాలు నేర్చుకోవడం, ఆచరణలో పెట్టడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఉండాలని, నిజాయితీ, నైతికత, శ్రమతో అనుకున్న స్థాయికి వెళ్లవచ్చని చెప్పారు. కళాశాలకు మంచిపేరు తేవాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కళాశాల సెక్రటరీ కృష్ణచైతన్య మాట్లాడుతూ విజయమనేది నిరంతర ప్రయాణమని, కొత్త విషయాలు నేర్చుకోవడం అలవాటుగా చేసుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అన్నా రాంబాబు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెన్నా కృష్ణారెడ్డి,ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ అనీల్‌కుమార్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

● పీఆర్ ఈఈ శ్రీనివాస్

పొదిలి రూరల్: గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పొదిలి మండలంలోని మూగచింతల, సూదనగుంట, అక్కచెరువు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. నిబంధనల్లో పేర్కొన్న కొలతల ప్రకారం రోడ్డు నిర్మించడంతోపాటు క్యూరింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ రవి ప్రకాశ్, ఏఈఈ వై.రామకృష్ణ, ఈఏలు శ్రీనివాస్, బాలకృష్ణ, శాంతన్‌కుమార్, భాస్కర్ ఉన్నారు.


సూదనగుంటలో సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

మార్కాపురం టౌన్: ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమన్నారు. పెట్టుబడి తగ్గడంతోపాటు మంచి దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ప్రతి గ్రామ సంఘం పరిధిలో స్వయం సహాయ సహకార సంఘాల ద్వారా యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ లలితమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే.. రెవెన్యూ గప్‌చుప్!

● పొదిలిలో తహసీల్దార్ లేక ఇక్కట్లు పడుతున్న ప్రజలు
● తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినా మరొకరిని నియమించని వైనం
● సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి విద్యార్థుల పడిగాపులు
● ముందుకు కదలని వ్యవసాయ భూముల మ్యుటేషన్ ఫైళ్లు
● వక్ఫ్ భూముల రికార్డులు లేక వెనుదిరిగిన డిప్యూటీ కలెక్టర్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పార్థసారథి

పొదిలి:

'సార్ వచ్చారా?.. సార్ ఉన్నారా?.. సార్ ఎప్పుడొస్తారు?'.. ఈ తరహా ప్రశ్నలు పొదిలి తహసీల్దార్ కార్యాలయంలో పదేపదే వినిపిస్తున్నాయి. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎంవీ కృష్ణారెడ్డి మార్చి నెల 20వ తేదీ నుంచి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. గత 15 రోజులుగా తహసీల్దార్ లేకపోవడంతో కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర అత్యవసరమైన సర్టిఫికెట్ల కోసం ప్రజలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. అలాగే భూతగాదాలు, ఇతర భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రైతులు ఎదురుచూడక తప్పడం లేదు.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఆందోళన

పోటీ పరీక్షల కోసం, అడ్మిషన్ల కోసం అవసరమైన క్యాస్ట్, ఈబీసీ, ఓబీసీ, ఈఎస్‌డబ్ల్యూ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కార్యాలయం చుట్టూ పడిగాపులు కాస్తున్నారు. ఇన్‌కమ్ సర్టిఫికెట్ డిప్యూటీ తహసీల్దార్ ఇస్తుండగా, మిగిలిన సర్టిఫికెట్లపై డిజిటల్ సంతకం తప్పనిసరిగా తహసీల్దార్ చేయాల్సి ఉంది. దీంతో విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందక ఆందోళనకు గురవుతున్నారు. పోటీ పరీక్షలకు గడువు సమీపిస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ఈబీసీ సర్టిఫికెట్లు ఏటా మార్చిలో తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత తీసుకున్నా ప్రయోజనం లేదని ఈబీసీ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 60 మంది విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.



పొదిలి తహసీల్దార్ కార్యాలయం

వెనుదిరిగిన డిప్యూటీ కలెక్టర్

వక్ఫ్ భూముల ఆక్రమణలపై పొదిలి పట్టణానికి చెందిన పలువురు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు, కోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ నిమిత్తం డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అవసరమైన రికార్డులు కొన్ని అందుబాటులో లేకపోవడం, తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో విచారణ వాయిదా వేసి వెనుదిరిగి వెళ్లారు.

మ్యుటేషన్ ఫైళ్లు పెండింగ్

రైతులకు భూ సంబంధిత పత్రాల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. సుమారు 20 మంది రైతులు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు తహసీల్దార్ ఉంటేనే ఫైళ్లు ముందుకు కదిలేది కష్టమవుతుందని, ఇక తహసీల్దార్ లేకపోతే మ్యుటేషన్ ముందుకు కదిలేది ఎలా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల సర్టిఫికెట్లుకు ఇబ్బంది

విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వస్తున్నారు. మ్యుటేషన్ ఫైళ్లు ఒక రోజు అటు ఇటైనా ఫర్వాలేదు. దానికి టైమ్ బౌండ్ ఉంటుంది. ఇన్‌చార్జి తహసీల్దార్‌ను నియమించాలని ఉన్నతాధికారులను కోరాం.

– షాజిదా, డిప్యూటీ తహసీల్దార్

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించాలి



పొదిలిలో తహసీల్దార్ లేకపోవటంతో ప్రజలు, విద్యార్థులు, రైతులు ఇక్కట్లు పడుతున్నారు. రెండు వారాల క్రితం తహసీల్దార్ లాంగ్ లీవ్‌పై వెళ్లినా అప్పటి వరకు తాత్కాలికంగా మరొకరిని నియమించకపోవడం సరికాదు. పోటీ పరీక్షల దరఖాస్తు కోసం అవసరమైన సర్టిఫికెట్లు సకాలంలో అందివ్వకపోతే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ఎంసెట్ దరఖాస్తుకు గడువు సమీపిస్తుండటం, మధ్యలో సెలవులు రావడంతో సర్టిఫికెట్లు అందే పరిస్థితి కూడా లేదు. మరో వైపు ఈబీసీ సర్టిఫికెట్లు మార్చినెలలో ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం అవసరమైన వారు పొందాల్సి ఉంది. ఈబీసీ సర్టిఫికెట్లు అవసరమైన వారు ఏమి చేయాలో తెలియక అయోమయంలో ఉన్నారు. ఉన్నతాధికారులను సంప్రదిస్తే కొనకనమిట్ల తహసీల్దార్‌ను నియమించామని చెబుతున్నారు. ఆయనను సంప్రదిస్తే తనకు ఆర్డర్స్ రాలేదని చెబుతున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను తక్షణమే నియమించాలి.

– కేవీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి

ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తాం

● డ్వామా పీడీ జోసెఫ్ కుమార్


సామాజిక తనిఖీల్లో పాల్గొన్న పీడీ జోసెఫ్ కుమార్, ఎంపీపీ, అధికారులు

తర్లుపాడు: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు, కూలీల మస్టర్‌లో అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రభుత్వ సొమ్ము రికవరీ చేస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. పలు గ్రామాల నివేదికలను పరిశీలించారు. కూలీల మస్టర్లలో పొరపాట్లు, హార్టికల్చర్‌కు సంబంధించి కొన్నిచోట్ల మొక్కలు లేకపోవడాన్ని గుర్తించినట్లు చెప్పారు. అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి ప్రజా ధనాన్ని రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఎంపీపీ భూలక్ష్మి, ఏపీఓ బుల్లెన్నరావు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మార్కాపురం టౌన్: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ సంఘటన మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రాజమోహన్‌రావు కథనం మేరకు.. కొండేపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న మల్లా శ్రీనివాసులు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద హోటల్ నిర్వహిస్తుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లిన ఆయన సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో దాచి ఉంచిన రూ.35 వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.7 వేల నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.